సేవిస్తూ తిరుగుతున్నాం. నా రూప యౌవనాలు నా వృత్తికి ఆటంకాలు కావడంచేత యీ పురుష వేషం ధరించి ముఖాన్ని వికారంచేసుకుని తిరుగుతున్నాను. ఇలా ఉంటే ఎవ్వరి దృష్టి నామీదకు ప్రసరించదు. దేవుని దయవల్ల మీలాంటి ఉదార హృదయుల సహకార సానుభూతులవల్ల పొట్ట ఎలాగో గడచిపోతోంది. దొరికినంతే సంతోషంతో స్వీకరించి తృప్తిపడతాం. కాని ఒక్క విషయం తల్చుకుంటే హృదయం కదిలిపోతుంది. అందరి జీవితాలకి వివాహం ఒక మంగళకార్యంగా రూపొంది శుభాకారి అయితే, అది నా పాలిట అపకారి అయింది. దేవుడి దయవల్ల సమయానికి సరిగా గుర్తించి ఆ నరకంలో అడుగుపెట్టలేదు గనక బతికిపోయాం. లేకపోతే నా గతి ఎలా వుండేదో! దేనికైనా ఆ పరమాత్ముని కృప ఉండాలి."

—అంటూ తన కథనం ముగించిందామె.

ఆమె కథ విన్నతరువాత నాకామెమీద జాలి ద్విగుణీకృతం అయింది. హృదయంలో ఏదో తెలియని బాధ రేగింది.

వచ్చి చాలా సేపవడంవల్ల లేచి వెళ్ళడానికుపక్రమించింది. మావారి పయిజామాలు షర్టులు రెండు జతలు యిచ్చానామెకు.

అవి స్వీకరించి నవ్వుతూ—

"అమ్మా? రక్షణకివి అవసరం. ఇందుకు మీకెంతో కృతజ్ఞురాలిని, దైవం మిమ్మల్ని రక్షించాలని కోరుతున్నాను. యీ భిక్షుకిని మరిచిపోకండి. నేనీ వూరు మళ్ళీ వచ్చినప్పుడు మిమ్మల్ని తప్పకుండా దర్శించుకుంటాను. మీ యిద్దరికీ నా ప్రణామాలు. నేను మరి వస్తాను. మా తల్లి సత్రంలో ఒక్కతే ఉంది. నాకోసం ఎదురుచూస్తూఉంటుంది" అంటూ నిష్క్రమించింది.

"జోగీ మత్ జా" అంటూ పల్లవి మాత్రం పాడుతూ వెళ్ళిపోయింది.

---

స్కెచ్

# ఎండమావులు

వల్లూరి కృష్ణారావు

తలంటు పోస్తూ అనేది బామ్మ: "నా తండ్రి కలక్టరు చేస్తాడు." బామ్మకళ్ళు నా కళ్ళను మాద్దాడేవి. నూనె కళ్ళు మిలమిలా మెరిపించే వాడిని. బామ్మ నా చూపులు చూసి పొంగి పోయేది పాపం! కలక్టరు ఠీవితో నవ్వేవాడిని! ఆ నవ్వులో ముందుముందుచాలాచాలా పెద్దవాడనవుతానని సూచన ఉండేది. బామ్మ ఎంతమంది మనమల్ని దీవించలేదు! వాళ్ళంతా కలక్టర్లు కాదు కదా కనీసం తాలూకా పెద్దలు కూడా కాలేదు. ఈ భావన వచ్చే ఈడు కాదు నాది అప్పుడు. రాకపోవడమే మంచిదేమో కూడాను. బామ్మకీ తెలుసును బామ్మ దీవెనలు ఎంతపని చేస్తాయో! కాని బామ్మ ఎన్ని దెబ్బలుతిన్నా బామ్మ ఎందుకో నమ్ముతూనే ఉండేది. ఆ నమ్మకం ఉండబట్టే నేమో అన్నేళ్ళు బ్రతుకగలిగింది!

కాలం ఆగదు. దాని ఉపగ్రహాల్లా మనుష్యులూ ఆగరు. నడక సాగిస్తూనే ఉంటారు. బామ్మలేదు. పైకి విచారించక పోయినా బామ్మ లేదనే లోటు అప్పుడప్పుడు కలుగుతూనే ఉండేది. ఇంట్లోఇంకా వీధి సావిట్లో నులక మంచంమీద మూలుగుతూ మాగన్నునిద్ర తీస్తున్నట్లే అనుకుంటాను. ముఖ్యంగా పంతులు వచ్చినప్పుడు గుర్తుకు వచ్చేది. పంతులు వీధిలోకి రాకుండానే "బాలూపంతులు వచ్చాడు రమ్మనవే." అనేది. జామి చెట్టెక్కి మారాముచేసే వాడిని. దిగను దిగను అంటూ దిగేవాడిని. రాను రాను అంటూనే పంతులు దగ్గరకు వచ్చేవాడిని. పంతులు కళ్ళనుచూసి హడలి కుయ్యిమనకుండా కూర్చునేవాడిని.

"ఎలా చెప్పుతావో నాయనా! వీడిమీద పెట్టుకున్నాం!" అనేది పంతులుతో! పంతులుకివి రోజూ వినిపించే మాటలే! ఒక్కొక్క రోజున జాలిపడే వాడు. మరొకరోజున విసుక్కునేవాడు. బామ్మ

వైపు ఎంతో ఇదిగా చూసేవాడివి. "చదువుకో నాన్నా!"అన్నట్లు చూసేది బామ్మ. ఇంకో మాటు బామ్మ మరీబాగా జ్ఞాపకానికివచ్చేది. అది తలంటుకున్నప్పుడు. బామ్మపోయాక అమ్మ నూనె పెట్టేది కాని అలాటి దీవెనలు అమ్మ ఇవ్వదు. ఒకవేళ అన్నా బామ్మ అన్నంత బాగా అనలేదు. బామ్మే అనాలి. బామ్మదగ్గరే విసరాలి కలక్టరు చూపులు!

రోజులు చాలా వేగంగా దొర్లాయి. కాని నాబండి గతుకుల్లోపడింది. కరుక్కుమని కాస్సేపు ఆగింది స్కూలుఫయినల్ లో. విచారించాను. చాలా సేపు ఏడ్చానుకూడా. నా ఏడుపుచూచి జాలి లేకపోగా నాన్న మండిపడ్డాడు. నాన్న పరిస్థితుల ప్రభావం నాకుఅర్థంకాలేదు అప్పుడు. మూలనున్న కుక్కిమంచంమీద ముడుచుకు పడుకున్న బామ్మ మూలిగినట్లు అనిపించింది. "బామ్మా" అంటూ బావురుమని నులకమంచంమీద పడి ఏడ్చాను. ఎంత ఏడ్చానో తెలియదుగాని తెల్లారి లేచి చూసుకుంటే నాన్న మంచంమీద ఉన్నాను. నాన్నమీద ఎంత ప్రేమవేసిందో అప్పుడు!

విధి ఎదురు తిరిగింది నా నడకకు. వరుసగా తిరిగి రెండు సంవత్సరాలు పరీక్ష తప్పాను. ఈసారి దుఃఖించలేదు సరికదా వాటిని గురించి ఏమీ అనుకోలేదు. పరీక్షలు పోవడం అలవాటయిందేమో! నాన్న ఎంతో ఓదార్చాడు. "నువ్వేం చేస్తావు. బాగా చదివావు. పోనీలే, 'హయ్యరు'కు చదువు."

ఛెళ్ళున తగిలింది కొరడా! బామ్మఅనే "బాలూ పంతులు," తుఫానులో వీధిలోకి గెంటి తలుపు వేసినట్లయింది! చెమటతో మొహం జిడ్డుఅయ్యింది! "అలాగే నాన్నా!"అన్నాను. ముసలి మంచంమీద పడుకొని దగ్గుతూ ముసలిబామ్మ యమయాతన పడుతున్నట్లనిపించింది. "నిన్ను మోసగించాను బామ్మా" అని మంచంమీదపడి ఏడ్చాను. ఎంతో సహనంకలదానిలా మూగగా నన్ను వళ్ళోకి తీసుకొని లాలిస్తున్నట్లు సంతృప్తిపడ్డాను.

నేను పూర్తిగా మారిపోయా ననుకుంటాను. పూర్వపు విషయాలను గురించి పట్టించుకోను. అథవా గుర్తుకువచ్చినా బాధపడను. నెమరుకు తెచ్చుకోవడానికి, ఆలోచించడానికి కూడా నాకున్న కాలం సరిపోదు. వెనకవాటిని గురించి త్రవ్వను. ముందుగురించి ఆలోచించను. ఏ రోజు కారోజు వెళ్ళడమే దుర్భరమయితే!

దొడ్లో చిన్నికి తలమీద నూనె పెడుతున్నది అమ్మ. అమ్మ మాటలు, "నాన్న కలక్టరు అవ్వాలి" స్పష్టంగా వినిపిస్తున్నాయి. చిన్ని గర్వంగా ఛాతీ విరిచాడు. నా కొడుకు కాదేమిటి? నేను కూడా నవ్వుకున్నాను. మరు క్షణంలో భయపడ్డాను. "అహా! అహా! ఎందుకమ్మా ఇప్పుడన్నా అవి! అలా వీధిలోకి వెళ్ళివస్తా" నని వెళ్ళిపోయాను.

ఆ యింటిముందు ఆగానో లేదో వీధి అరుగు మీద కూర్చున్న ముసలి అవ్వ కీచుగా కేక పెట్టింది "చంటాడి పంతులు వచ్చాడే" అని. వెంటనే బామ్మ గుర్తుకువచ్చింది. "నువ్వెప్పుడూ అనుకోనంతగా అన్యాయం చేస్తున్నాను బామ్మా! నువ్వు ఎప్పుడూ చూడని కలక్టరుగా నన్ను ఊహించుకున్నావేగాని, రోజూ కనపడే పంతులులా ఒక్కసారయినా—(కలలోనయినా! కలేవస్తే గావుకేక పెట్టివుండేదానివేమో కూడా భయంతోనూ, బాధతోనూ) అనుకోలేదు"అనుకున్నాను.

బుద్ధిమంతుడులా కూర్చున్నాడు ఆ చిన్న అబ్బాయి. ఆ ముసలావిడ అంటోంది: "ఎలా చెప్పుతావో నాయనా..." నా కావిడ మాటలు వినిపించటంలేదు. కాని నాలో నేను గొణుక్కున్నాను. ప్రతీవాడూ ఎండమావుల్ని వెంటాడతాడు. అది నిజం. అలా వెంటాడకపోతే మనిషికి సౌఖ్యమనేదే ఉండదేమోకూడా! ఆ ముసలావిణ్ణి ఎంతో జాలిగా చూశాను. ఎన్నో అనుకుంటోంది ఆ పసికందుని చూసి. వాడి భాగ్యరేఖ నాచేతిలో ఉందనుకుంటోంది. పాపం! ఎంత అమాయకురాలో! నిస్సహాయంగా మూలుగుతూ గొణిగాను, 'నిన్నేకాదు పంతులు ప్రపంచాన్నే మోసగిస్తాడు.'

---

భార్య: (లాలనగా) ఏమండీ! నా తరవాత నాలాంటి పెళ్ళాం మళ్ళీ మీకు దొరుకుతుందా?

భర్త: అబ్బే! మళ్ళీ నీలాంటి దానికోసం నేను వెతకనుగా!